సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 1 । నవంబర్ । 2023



ఆ గ్రామాలకు వెళ్లలేం..
మావోయిస్టుల హెచ్చరిక నేపథ్యంలో అటవీ ప్రాంత గ్రామాల వైపు రాజకీయ నేతల అడుగులు పడడం లేదు. 10లో



ఇంటి పంట.. మెరుగంటా!
ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యాన పలువురు ఇళ్లలోనే కూరగాయలు, ఆకుకూరల సాగుకు మొగ్గు చూపుతున్నారు. 12లో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

భౌతిక దాడులు తగవు

విప్ రేగా కాంతారావు



కోనేరు చిన్నిని సన్మానిస్తున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటమి పాలవుతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఎన్నికల ప్రచారం కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో కూడా ఆదరించాలని కోరారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, ఆవుల నర్సింహారావు పాల్గొన్నారు.

రేగాను కలిసిన కోనేరు చిన్ని

ప్రభుత్వ విప్ రేగా కాంతారావును పినపాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ కోనేరు సత్యనారాయణ(చిన్ని) మంగళవారం స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చిన్నిని ఎమ్మెల్యే రేగా కాంతారావు ఘనంగా సత్కరించారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్, చేపల మార్కెట్, గోల్డ్ షాప్ లైన్, రామాలయం టెంపుల్ ఏరియాలకు చెందిన సుమారు 160 కుటుంబాల వారు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

అడవుల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలి

ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి

అశ్వారావుపేటరూరల్: అడవుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. పోడు సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోడు నరికితే సహించవద్దని ఆదేశించారు. పోడు వల్ల జరిగే నష్టాలు, ఇబ్బందుల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే ఈ ఏడాది చేపట్టే పనులు, ఇప్పటివరకు చేసిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజర్ కరుణాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఎన్‌సీఈఆర్‌టీ సర్వే

ఖమ్మం సహకారనగర్: విద్యాప్రమాణాలు, భాషా, గణిత నైపుణ్యాల స్థాయిని నిర్ధారించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యాన జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి సర్వే నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లాలోని 854 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులు సుమారు 20వేల మంది నైపుణ్యాలను సర్వేలో భాగంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు సాధన పరీక్షలు నిర్వహించగా, చివరి సాధన పరీక్షలు నిర్వహించాక సర్వే చేపడుతామని తెలిపారు.



ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో సిద్ధమైన సీఎం సభా వేదిక

సభకు సన్నద్ధం

నేడు ప్రజాశీర్వాద సభ

- హాజరుకానున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం
- బొజ్జాయిగూడెం వద్ద సభా వేదిక సిద్ధం
- 75 వేల మందిని సమీకరించాలని లక్ష్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ ఎన్నికల సీజన్‌లో జిల్లాలో జరుగుతున్న తొలి ప్రచార సభకు భారత రాష్ట్ర సమితి అధినేత, సీఎం కేసీఆర్ హాజరవుతున్నారు. దీంతో నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు ప్రజా ఆశీర్వాద సభ విజయవంతానికి శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారు. సీఎం బహిరంగ సభ నేపథ్యంలో ఇల్లెందు, పరిసర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు, నిఘాను పోలీసు శాఖ ఏర్పాటు చేస్తోంది.

ఇదే తొలి సభ..

తొలి ఎన్నికల ప్రచార సభ బుధవారం మధ్యాహ్నం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం సమీపంలో జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. బీఆర్‌ఎస్ తరఫున ఇల్లెందు నుంచి పోటీ చేస్తున్న హరిప్రియను గెలిపించాలంటూ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియనాయక్ గత పది రోజులుగా సభా ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. కాగా మంగళవారం మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు కూడా ఇల్లెందు చేరుకుని బహిరంగ ఏర్పాట్లను పరిశీలించారు.

రికార్డు స్థాయిలో

కేసీఆర్ సభ కోసం బొజ్జాయిగూడేనికి ముందు రెండు, మూడు స్థలాలను పరిశీలించినా.. చివరకు ఇక్కడే మొగ్గు చూపారు. బహిరంగ సభ కోసం 16 ఎకరాల స్థలాన్ని చదును చేశారు. ఇందులోనే వేదిక, సభకు వచ్చే ప్రజల కోసం గ్యాలరీలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక, ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. సభను విజయవంతం చేసేందుకు 75 వేల మందిని సమీకరించాలని గులాబీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నేతలు సఫలమైతే నియోజకవర్గంలో ఇదే భారీ బహిరంగ సభగా రికార్డులకు ఎక్కడం ఖాయం.

సత్తుపల్లి మీదుగా

సీఎం కేసీఆర్ బుధవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి ముందు సత్తుపల్లికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2 గంటలకు బొజ్జాయిగూడెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. స్వాగత కార్యక్రమాలు పూర్తయిన వెంటనే నేరుగా వేదిక మీదకు వస్తారు.

జల్లెడ పడుతున్నారు

ఎన్నికలు బహిష్కరించాలంటూ మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ కమిటీల నుంచి క్రమం తప్పకుండా లేఖలు జారీ అవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జగన్, అల్లూరి – భద్రాద్రి జిల్లాల కార్యదర్శి ఆజాద్ పేరిట పలు లేఖలు జనబాహుళ్యంలోకి రాగా.. మంగళవారం ఇల్లెందు, నర్సంపేట డివిజన్ తరఫున పాపన్న పేరుతో మరో లేఖ వచ్చింది. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్‌కు గడువు దగ్గర పడటంతో క్రమంగా రాజకీయ వేడి రాజుకుంటోంది. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో విస్తారంగా ఉన్న అడవుల్లో విస్తృతంగా కూంబింగ్ (జల్లెడ) చేపడుతున్నారు. దీంతో పాటు అటవీ సమీప ప్రాంతాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన పోలీసులు అక్కడ పరేడ్ నిర్వహిస్తున్నారు.

ఎస్పీ పర్యవేక్షణలో

సాధారణంగా సీఎం స్థాయి ప్రొటోకాల్ ఉన్న వ్యక్తులు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటే ఏఎస్పీ స్థాయి అధికారులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈ ఎన్నికల సందర్భంగా జిల్లా మొత్తంగా సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించారు. అంతేకాకుండా సభా ప్రాంగణానికి సమీపంలోనే అడవులు ఉన్నాయి. దీంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇల్లెందులో సీఎం కేసీఆర్ హాజరయ్యే సభకు హోం గార్డు నుంచి ఎస్పీ స్థాయి వరకు మొత్తం 800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టనున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే ఇల్లెందు పట్టణం క్రమంగా పోలీసుల అదుపులోకి వెళ్లింది. జిల్లా ఎస్పీ వినీత్ నేడు దగ్గరుండి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఇల్లెందు : ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో నేడు జరిగే సీఎం సభ ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం సందర్శించారు. ఎస్పీ డాక్టర్ వినీత్, ఓఎస్డీ సాయి మనోహర్, ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తితో పాటు సీఎం సెక్యూరిటీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడి ఏర్పాట్లను డీఎస్పీ, సీఐ ఉన్నతాధికారులకు వివరించారు. హెలీ ప్యాడ్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేశారు.

పోలింగ్ శాతం పెంచాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ఎన్నికల్లో జిల్లాలోని 166 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ తక్కువగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ పెరిగేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేలా కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులను ఓటు వినియోగంపై చైతన్యం చేయాలని చెప్పారు. విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, ఆటంకాలు, అవినీతి కార్యకలాపాలు, ఓటర్లను ప్రలోభపెట్టే ఎలాంటి చర్యలైనా సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, దీనిపై అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పోలింగ్ బూత్ సమాచారం, ఓటరు కార్డులో మార్పులు, పోటీ చేసే అభ్యర్థుల వివరాలు, ఫలితాలు తదితర అంశాలను పొందవచ్చని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్‌బాబు, డీపీఓ రమాకాంత్, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఐఈఓ సులోచనారాణి, యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పటేల్ జయంతి వేడుకలో కలెక్టర్ ప్రియాంక

ఘనంగా పటేల్ జయంతి

దేశానికి స్వాతంత్య్రం తర్వాత సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయడానికి కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ జునాగఢ్ లాంటి సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కు దక్కుతుందని అన్నారు. దేశ విభజన అనంతరం అనేక ప్రాంతాల్లో జరిగిన అల్లర్లను చాకచక్యంగా అణచివేశారని వివరించారు. పటేల్ జాతీయ సమైక్యతకు ప్రతీకని అన్నారు. దేశ ప్రథమ హోంమంత్రిగా ప్రజలకు అమూల్య సేవలు అందించారని కొనియాడారు. స్వదేశీ సంస్థలను విలీనం చేసి దేశ ఐక్యతకు పాటుపడ్డారని చెప్పారు. అనంతరం అధికారులతో ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు.

వనమా కేసు జనవరి 9కి వాయిదా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు ఎన్నిక చెల్లదంటూ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు దాఖలు చేసిన కేసులో విచారణను సుప్రీం కోర్టు జనవరి 9వ తేదీకి వాయిదా వేసింది. మంగళవారం ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

వనమాకు ఊరట

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై భారత రాష్ట్ర సమితి నమ్మకం పెట్టుకుంది. దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకే టికెట్ ఖరారు చేయడంతో పాటు ఇటీవల బీ ఫామ్ సైతం అందించింది. నామినేషన్ వేసేందుకు వనమా సిద్ధమవుతున్నారు. అయితే గత ఎన్నికకు సంబంధించి వనమాపై నడుస్తున్న కేసు మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో వ్యతిరేక తీర్పు వస్తే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు ఉదయించాయి. అయితే కోర్టులో కేసు మరోసారి వాయిదా పడటంతో వనమాకు, ఆయన మద్దతుదారులకు ఊరట కలిగింది.

జలగం వర్గీయుల్లో నిరాశ..

వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ గత నాలుగేళ్లుగా హై కోర్టులో జలగం వెంకట్రావు పోరాడుతున్నారు. గత జూలైలో హై కోర్టులో వచ్చిన తీర్పుతో వనమా స్థానంలో జలగం ఎమ్మెల్యేగా గుర్తింపు పొందడంతో పాటు తిరిగి ఎన్నికల బరిలో నిలబడతారని ఆయన మద్దతుదారులు నమ్మకం పెట్టుకున్నారు. అయితే ఈ కేసు హై కోర్టు నుంచి సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీం కోర్టులో వెలువడే తీర్పు ఆధారంగా రాజకీయంగా ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోవాలని జలగం వెంకట్రావు భావించారు. అయితే కేసు మరోసారి వాయిదా పడడంతో జలగం వర్గీయుల్లో నిరాశ నెలకొంది.

ఇల్లెందు ఎమ్మెల్యేకు నోటీసులు జారీ

- తీసుకునేందుకు నిరాకరించిన హరిప్రియ
- పలుచోట్ల ఫ్లెక్సీల ఏర్పాటుతో సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదులు

ఇల్లెందు: ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో బుధవారం సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నేపథ్యంలో పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. మహబూబాబాద్ క్రాస్ రోడ్ నుంచి కరెంటాఫీస్ వరకు రోడ్డుకు ఇరు వైపులా ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు అనుమతి లేదంటూ కొందరు పట్టణ వాసులు సీ – విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు జేకే బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. ఇదిలా ఉండగా బహిరంగ సభ బొజ్జాయిగూడెం సమీపంలో జరుగుతుండగా ఫ్లెక్సీలు మాత్రం పట్టణంలో ఏర్పాటు చేశారంటూ కొంతమంది ఎన్నికల అధికారి కాశయ్యకు, సహాయ ఎన్నికల అధికారి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగి ఎమ్మెల్యే హరిప్రియకు నోటీస్ జారీ చేశారు. అయితే ఆమె నోటీస్ స్వీకరించేందుకు నిరాకరిస్తూ ఫ్లెక్సీలు తొలగిస్తామని హామీ ఇవ్వటంతో అధికారులు వెనక్కి తగ్గారు. కాగా, ఫ్లెక్సీల తొలగింపులో జాప్యం చేస్తున్నారంటూ ప్రత్యర్థి పార్టీల వారు 'సీ విజిల్' యాప్ ద్వారా మరోమారు ఫిర్యాదు చేసినట్లు అధికారులు కుమారస్వామి, ఘనీ తెలిపారు. కాగా, ఫ్లెక్సీలు తొలగించడం లేదంటూ జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య నిరసన తెలిపారు.



ఎమ్మెల్యే హరిప్రియ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



ఫ్లెక్సీని పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు

- ఖమ్మం జిల్లాలో పది మిల్లుల్లో మొదలు..
- రేపటి నుంచి భద్రాద్రి జిల్లాలో ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) బుధవారం నుంచి ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్లు మొదలుపెట్టనుంది. ఇప్పటికే ఆరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని పది జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తి ధరను తేమశాతం ఆధారంగా రూ.7,020గా నిర్ణయించి, 8 నుంచి 12 శాతం తేమ శాతం ఉన్న పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయించనుంది. తేమశాతం పెరిగే కొద్ది కిలోకు రూ.70 చొప్పున ధర తగ్గిస్తారు. కాగా, పత్తి కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించగా, జిన్నింగ్ మిల్లులో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం వెల్లడించారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు మొదలుపెడతామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం తెలిపారు. జిల్లాలో నిర్దేశించిన నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు. కాగా, రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌తో రావాలని, ఆధార్ అనుసంధానం పూర్తయి ఉండాలని తెలిపారు.

ప్రైవేట్ మార్కెట్‌లో పుంజుకున్న ధర

రెండు రోజులుగా ప్రైవేట్ మార్కెట్‌లో పత్తి క్వింటాకు గరిష్టంగా రూ.7,100 ధర పలుకుతోంది. సీసీఐ కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు రూ.7,020 చెల్లించనుండగా, ఇంత కంటే ఎక్కువగానే చెల్లిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు పంట విక్రయించిన వెంటనే రైతుకు నగదు రూపంలో చెల్లించనుండగా, సీసీఐ కేంద్రాల వైపు మొగ్గు చూపుతారా, లేదా అన్నది తేలాల్సి ఉంది.



సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలిస్తున్న సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు

పట్టు వీడేదిలే..

- పోటీకి సిద్ధమంటున్న కమ్యూనిస్టులు
- కాంగ్రెస్‌తో పొత్తు ఖరారైతే వైరా, కొత్తగూడెం బరిలో..
- లేదంటే భద్రాచలం సహా మరిన్ని స్థానాల్లో సై

భద్రాచలం: ఈనెల 30న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టులు పోటీకి సిద్ధమవుతున్నారు. బీఆర్‌ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించినప్పటికీ ఆ పార్టీ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కాంగ్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో చర్చలు సాగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పొత్తులు ఖరారు కాలేదు. ఉమ్మడి జిల్లాలో సీపీఐకి కొత్తగూడెం, సీపీఎంకు వైరా స్థానాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇక భద్రాచలం సీటును మొదట సీపీఎం ఆశించింది. అయితే అక్కడ కాంగ్రెస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను అభ్యర్థిగా ప్రకటించటంతో ఆ స్థానాన్ని వదులుకునేందుకు సీపీఎం అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇక పొత్తు ఖరారు కాకుంటే భద్రాచలంతో పాటు ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని సీపీఎం ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న నియోజకవర్గాల్లో వారి బలాబలాలను పరిశీలిద్దాం..

భద్రాచలంలో గతంలో సీపీఎం హవా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎంకు 2009లో మినహా ఎదురు లేని పరిస్థితి ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం ఆ ప్రతిష్ట క్రమంగా మసకబారుతోంది. నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత 16 సార్లు ఎన్నికలు జరిగితే ఎనిమిది సార్లు సీపీఎం, రెండుసార్లు సీపీఐ గెలుపొందాయి. 1978 నుంచి 2004 వరకు వరుసగా సీపీఎంకు చెందిన అభ్యర్థులే ఏడుసార్లు విజయం సాధించారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం పరిస్థితి తారుమారయింది. 2014లో విలీన మండలాల్లో కలిపే ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2,16,772 ఓట్లకు గాను 76.60 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో సీపీఎంకు చెందిన సున్నం రాజయ్య వైఎస్సార్‌సీపీ పొత్తుతో 34.78 శాతం అంటే 57,750 ఓట్లు సాధించి గెలుపొందారు. 2018లో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలతో కలిపి జరిగిన ఎన్నికల్లో 1,37,354 ఓట్లకు గాను 80.41 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఇందులో 43.23 శాతం ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపొందారు. సీపీఎం అభ్యర్థి మిడియం బాబురావు 12.88 శాతం అంటే 14,228 ఓట్లు మాత్రమే సాధించి మూడో స్థానంలో నిలిచారు. సీపీఎంకు పట్టున్న చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాలు రాష్ట్ర విభజనతో ఏపీలో కలవగా ఆ పార్టీ బలహీనపడిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఖరారు కాకుంటే సీపీఎం అభ్యర్థిగా దుమ్ముగూడెం మండలానికి చెందిన ఓ నాయకుడిని బరిలో దింపేందుకు సమాయత్తం అవుతున్నారని సమాచారం. కాంగ్రెస్‌తో పొత్తు ఖరారైతే మాత్రం అప్రతిహతంగా సీపీఎం పోటీ చేస్తున్న ఈ నియోజకవర్గంలో ఆ రికార్డుకు బ్రేక్ పడినట్లే.

వైరాలో ఆదరణ అంతంతే..

వైరా నియోజకవర్గంలో సీపీఎం గెలిచిన సందర్భాలు ఇంతవరకూ లేవు. 2018 ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలో 89.19 శాతం ఓట్లు పోల్ కాగా 33.36 శాతం ఓట్లతో స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ విజయం సాధించారు. సీపీఐకి చెందిన బానోత్ విజయాభాయి 20.75 శాతం (32,757) ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక సీపీఎంకు చెందిన భూక్యా వీరభద్రం 7.21 శాతం(11,373) ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. 2014లో 89.01 శాతం ఓట్లకు గాను వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ 40.35 శాతం ఓట్లతో మొదటి స్థానంలో, సీపీఐకి చెందిన మూడ్ నారాయణ 18.41 శాతం(27,071) ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో సీపీఎం వైఎస్సార్‌సీపీకి మిత్రపక్షంగా వ్యవహరించింది.

కొత్తగూడెంలో సీపీఐ ఒక్కసారే..

కొత్తగూడెం నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో టీడీపీ, టీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం మహా కూటమిగా నిలిచాయి. పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకి కేటాయించగా కూనంనేని సాంబశివరావు 32.89 శాతం (47,028) ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన వనమా వెంకటేశ్వరరావు గట్టి పోటీ ఇచ్చి 31.49 శాతం (45,024) ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇక 2014లో సీపీఐ తరఫున కూనంనేని సాంబశివరావు ఒంటరిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి జలగం వెంకట్రావు 30.67 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో నిలువగా, కూనంనేని 12.79 శాతం (20,994) ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2018లో కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్ పార్టీలతో మహాకూటమిగా ఏర్పడి కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి కాంగ్రెస్‌కు చెందిన వనమా వెంకటేశ్వరరావు గెలుపొందారు.

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

జెడ్పీ చైర్మన్ కోరం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ఇల్లెందుకు వస్తున్న సమయంలోనే బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. ఇల్లెందు, బయ్యారం మండలాల నుంచి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సుమారు 100 మంది బీఆర్‌ఎస్, ఎన్డీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం ఇల్లెందులో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బయ్యారం, ఇల్లెందు మండలాలకు చెందిన ముగ్గురు సర్పంచ్‌లు, ఐదుగురు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కోరం కనకయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నేతల దోపిడీతో నాయకులు, ప్రజాప్రతినిధులు విసిగి వేసారి ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ జెండా మోసిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వటం దుర్మార్గమన్నారు. సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సీతారామా ప్రాజెక్టు అడ్రస్ లేకుండా పోయిందని ఆరోపించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కోసం దీక్ష చేసిన నేతలు ఈనాడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముసలయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, బత్తిని రామ్మూర్తి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణమ్మ, అనసూర్య, లక్ష్మణ్‌రావు, సోమేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

క్లుప్తంగా

సమస్యలు ఉన్న ఉపాధ్యాయులను మినహాయించండి..



మాట్లాడుతున్న బి.రాజు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పాలిచ్చే తల్లులు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళ్లు చేతులు లేని వారికి, కంటిచూపు సరిగా లేనివారికి, డయాలసిస్ పేషెంట్లకు, హార్ట్ సర్జరీ చేయించుకున్నవారికి, కేన్సర్ పేషెంట్లకు ఎన్నికల విధులు కేటాయించారని, అలాంటి వారు విధులు నిర్వహించడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చని తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వి.సరియా పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక రాశులు

ములకలపల్లి: ఇసుక నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ శివారులోని గ్రామాల్లో ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు అధికారులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించి, రెండు వేర్వేరు ప్రదేశాల్లో డంప్ చేసిన భారీ ఇసుక రాశులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ ప్రాంతంలో వందలాది ట్రక్కుల్లో అక్రమంగా నిల్వ చేస్తున్నారని, దొడ్డిదారిన లారీల్లో రవాణా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో జగన్నాథపురం ఆర్ఐ వెంకటేశ్వర్లు, సీతారాంపురం జీపీ సెక్రటరీ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.83 లక్షల నగదు సీజ్

భద్రాచలంఅర్బన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును టౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కూనవరంరోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా కూనవరం నుంచి భద్రాచలం వైపు వస్తున్న వ్యాపార వేత్త వద్ద రూ.2,83,300 నగదు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు టౌన్ సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

రూ.1.80 లక్షలు..

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం, మర్రిగూడెం గ్రామాల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును కొమరారం పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఆయా గ్రామాల్లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో అటుగా వచ్చిన ప్రయాణికుడి వద్ద ఆధారాలు లేకుండా పెద్దమొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒకరి వద్ద రూ.లక్ష, మరొకరి వద్ద రూ.80 వేలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ శివారులోని పేకాట స్థావరంపై మంగళవారం ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఇటీవల ఎర్రబోయిన నాగేశ్వరావు హత్యకు గురికాగా, ఈ కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామంలో నాగేశ్వరరావు భార్య ఉషారాణి, తల్లిదండ్రులు మంగళవారం మాట్లాడారు. కేసు నుంచి వినయ్‌ను తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే జరిగితే తామంతా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఇకనైనా పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ట్రాక్టర్, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తల్లాడ: తల్లాడ బస్టాండ్ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు వెళ్లున్న కారు, తల్లాడ బస్టాండ్ వద్ద టర్నింగ్ తీసుకుంటున్న ట్రాక్టర్ ఢీకొన్నాయి. దీంతో ట్రాక్టర్ ట్రక్కు కారు పైకి ఎక్కగా, కారులో ప్రయాణిస్తున్న వేంసూరు మండలం భీమవరానికి చెందిన సీ.హెచ్.ఉదయ్, జి.మణికి గాయాలయ్యాయి. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

ఆ గ్రామాలకు వెళ్లలేం..

- మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలకు రాని రాజకీయ నాయకులు
- అక్కడ ప్రచారం నిర్వహించేందుకు వెనుకడుగు
- ఇప్పటికే వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఎన్నికలు బహిష్కరించాలని మావోల పిలుపు



సరిహద్దు ప్రాంతంలో ఉన్న కుర్నపల్లి గ్రామం

చర్ల: అటవీ ప్రాంత గ్రామాల వైపు రాజకీయ నేతల అడుగులు పడడం లేదు. భద్రాచలం నియోజకవర్గంలో మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో రాజకీయ నాయకులు అటవీ ప్రాంత గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. నియోజకవర్గంలో మావోయిస్టుల ప్రాబల్యం దాదాపు అన్ని మండలాల్లో ఉన్నప్పటికీ చర్ల మండలంలో అధిక ప్రభావం ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి మండలమే సరిహద్దు. ఆ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని మారుమూల గ్రామాల నుంచి నిత్యం ఆదివాసీలు వచ్చి పోతుండటంతో వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు సంచరించే అవకాశం ఉండటంతో రాజకీయ నాయకులు వచ్చేందుకు జంకుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం మండలంలోని కుర్నపల్లి ప్రాంతానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఒకసారి, పూసుగుప్ప ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొదెం వీరయ్య ఒకసారి వెళ్లి గ్రామాలను చుట్టి వచ్చారు. అంతకుముందే మావోయిస్టు పార్టీకి చెందిన పలు కమిటీలు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తూ లేఖలను విడుదల చేయడం ప్రారంభించాయి. దీంతో అధికార పార్టీ నాయకులు అటువైపు రావడం లేదు. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఆదివాసీ గ్రామాలకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

వరుస లేఖలతో కలకలం

అక్టోబర్ 10న మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ లేఖను విడుదల చేసింది. బ్రాహ్మణీయ, హిందుత్వ, ఫాసిస్టు బీజేపీ, బీజేపీకి మద్దతిస్తున్న అవకాశవాద బీఆర్ఎస్‌ను తన్ని తరమాలని, ప్రతిపక్ష పార్టీలన్నింటినీ నిలదీయాలని కోరింది. కాగా, అక్టోబర్ 12, 23న భద్రాద్రి కొత్తగూడెం, తూర్పు గోదావరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ లేఖ విడుదల చేశారు. 14న కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్, 26న వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్, 29న చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ లేఖలు విడుదల చేశారు. అందరూ దాదాపుగా బీజేపీ, దానికి మద్దతునిచ్చే అవకాశవాద బీఆర్ఎస్‌ను తరిమేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ రాజకీయ నాయకులైన పువ్వాడ అజయ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రోత్సహిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. కాగా, అక్టోబర్ 26న మండలంలోని పులిగుండాల సమీపంలో ప్రధాన రహదారిపై మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కరపత్రాలు విడుదల కాగా అందులో ఎన్నికలను బహిష్కరించాలని, వచ్చే వారిని నిలదీయాలంటూ పిలుపునిచ్చింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఒకరి కాల్చివేత

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరాం రాష్ట్రాల్లో సైతం ఎన్నికలు జరుగుతుండగా రాజకీయ నాయకులను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే క్రమంలో విధ్వంసాలకు సైతం దిగుతున్నట్లు తాజా ఘటనలను బట్టి స్పష్టమవుతోంది. అక్టోబర్ 21న సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో గల సర్కెడా గ్రామంలో బీజేపీ నాయకుడు బిర్జూతారంను కాల్చి చంపగా అదే రోజు చర్ల మండలంలోని వెంకటచెరువు సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు కరపత్రాలను తీసుకొస్తున్న ముగ్గురు ఆర్‌పీసీ (రెవెల్యూషన్ పీపుల్స్ కమిటీ) సభ్యులను అరెస్టు చేశారు.

కరపత్రాల కలకలం



మల్లన్న వాగు బ్రిడ్జి వద్ద లభించిన కరపత్రాలు

గుండాల: ఏజెన్సీలో మావోయిస్టుల కరపత్రాలు కలకలం రేపాయి. చాలా ఏళ్ల తర్వాత మండలంలో మావోయిస్టుల కరపత్రాలు లభించాయి. గుండాల - సాయనపల్లి మధ్య మల్లన్న వాగు బ్రిడ్జి, యాపలగడ్డ వద్ద ఈ కరపత్రాలు మంగళవారం తెల్లవారుజామున కనిపించాయి. అందులో ఓట్ల కోసం దోపిడీ దొంగల పార్టీల నాయకులు వస్తున్నారని, వారిని సమస్యలు పరిష్కరించడం లేదని నిలదీయాలని విద్యార్థులు, మహిళలు, దళితులు, కార్మికులకు సూచించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎన్నికలను బహిష్కరించాలని పేర్కొన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించాలని, మతోన్మాద విద్యా విధానాన్ని ప్రవేశపెట్టేందుకు బీజేపీ చేస్తున్న కుట్రపూరిత యత్నాలను నిలిపివేయాలని, కామన్ స్కూల్ విధానాన్ని కొనసాగించాలని, కార్పొరేట్ స్కూళ్లను రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించాలని సూచించారు. ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, మావోయిస్టుల కోసం పోలీసులు పహారా కాస్తూనే ఉన్నారు. ఇటు పోలీసులు, అటు కరపత్రాల విడుదలతో ఎప్పుడు ఏం జరుగుతుందనే భయం పల్లెల్లో నెలకొంది.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 22 కేజీల గంజాయి పట్టుబడింది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని డిగ్రీ కళాశాల సెంటర్, అంబేడ్కర్‌సెంటర్, బస్టాండ్, ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన బిద్యుత్ హల్దార్, బుద్రి కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. మల్కన్‌గిరిలో కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. వీరి నుంచి 16.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వి.సాయికుమార్, ఎస్కే ఫయాజ్ సీలేరు నుంచి 6.45 కేజీల గంజాయిని వినుకొండకి తరలిస్తూ పట్టుబడ్డారు. మొత్తం నలుగురు వ్యక్తులు, 22.6 కేజీల గంజాయి, ఒక కారు, ఒక బైక్, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు యువకులు అరెస్ట్

ఖమ్మానికి చెందిన ముగ్గురు యువకులు ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల్లో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మానికి ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకోగా వివరాలు సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు. కూనవరంరోడ్డులో ఎస్ఐ విజయలక్ష్మి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఖమ్మానికి చెందిన షేక్ నన్నేసాహెబ్, ఆవుల గోవర్ధన్, గొడ్డా గోపి 12 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయి, బైక్, మొబైళ్లు స్వాధీనం చేసుకుని, యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

ఏసీబీ వలలో పీఆర్ సీనియర్ అసిస్టెంట్

- రూ.3వేలు తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగి
- ఇప్పటికే పదోన్నతి, చార్జ్ ఇచ్చేందుకు వచ్చి నగదు డిమాండ్



పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ హరిత

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.హరిత మంగళవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆమె ఇప్పటికే పదోన్నతిపై ఇంకో చోట విధుల్లో చేరినా, తాను పనిచేసిన సమయం నాటి బిల్లు అని చెబుతూ డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ ఏసీపీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన కాంట్రాక్టర్ కాకుమాను మల్లికార్జున్ 2017–18లో ఎంపీ లాడ్స్ నిధుల నుండి సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులకు రావాల్సిన రూ.2.59లక్షల బిల్లు కోసం అధికారుల వద్దకు రాగా, రెండు శాతం తమకు ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్ హరిత తెలిపారు.దీంతో మల్లికార్జున్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కాప్రణాళికతో హరిత కార్యాలయంలో రూ. 3 వేలు నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి హైదరాబాద్ నాంపల్లిలోని ఉన్న ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న హరిత ఇటీవల పదోన్నతిపై కోదాడ సర్కిల్ సూపరింటెండెంట్‌గా బదిలీ కాగా, సోమవారం అక్కడ విధుల్లో చేరారు. ఖమ్మంలో మరో ఉద్యోగికి చార్జ్ అప్పగించేందుకు వచ్చి నగదు తీసుకుంటూ పట్టుబడడం గమనార్హం. ఏసీబీ సీఐలు మహేష్, శేఖర్, సునీల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.61.75 కోట్లకు ఐపీ దాఖలు చేసిన దంపతులు

ఖమ్మం లీగల్: ఏపీలోని విజయవాడకు చెందిన గూదే రాంబాబు - రాధారాణి దంపతులు రూ.61.75 కోట్లకు గాను ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో మంగళవారం దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశారు. కేసు వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన రాంబాబు-రాధారాణి ఖమ్మం, హైదరాబాద్ ఉంటూ శ్రీ సాయి ఏజెన్సీ, శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీ పేర్లతో వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 1,300 కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యం నిర్దేశించుకుని, ఇప్పటికే 161 కేంద్రాలు తెరిచారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో కూడా మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వ్యాపారం, విస్తరణ కోసం రెండు రాష్ట్రాల్లో చెందిన 127మంది వద్ద రూ.61,75,85,289 అప్పు చేశారు. ప్రస్తుతం వ్యాపారంలో నష్టపోయామని, అప్పు తీర్చలేని పరిస్థితి ఉందని చెబుతూ 127మంది ప్రతివాదులుగా చేర్చి ఐపీ దాఖలు చేశారు. అలాగే, ప్రతివాదుల నుంచి ప్రాణహానీ ఉన్నందున రక్షణ కల్పించాలని న్యాయస్థానాన్ని కోరారు.

ఏఎస్సైకి నాన్ బెయిలబుల్ వారెంట్

ఖమ్మం లీగల్: ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్ ఏఎస్సై నేలకుర్తి వెంకట్‌రెడ్డిపై ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు మంగళవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గృహహింస కేసు ఎదుర్కొంటున్న ఆయన తన భార్య, ఇద్దరు కుమార్తెలకు 2020 సంవత్సరం నుంచి భరణం చెల్లించడం లేదు. దీనికి తోడు కోర్టుకు కూడా హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి కాసరగడ్డ దీప ఎన్‌బీడబ్ల్యూ జారీ చేశారు.

మహిళతో హాస్టల్ వార్డెన్ అసభ్య ప్రవర్తన

చర్యలు తీసుకోవాలని నాయకుల డిమాండ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థిని చేర్చుకుంటానని నమ్మబలికి, విద్యార్థి తల్లితో అసభ్యంగా ప్రవర్తించిన వార్డెన్ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈసందర్భంగా మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడతూ హాస్టల్‌లో తన కుమారుడిని చేర్పించేందుకు మహిళ రాగా, వార్డెన్ శ్రీధర్ గదిలోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపించారు. దీంతో మహిళ కేకలు వేయగా వార్డెన్ పారిపోయాడని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు కరుణ్, శ్రీకాంత్, పృథ్వీ, లాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వార్డెన్ శ్రీధర్ వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్‌చేశారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కౌశిక్, రాకేష్, ప్రతాప్, రోహిత్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



ప్రత్యూష (ఫైల్)

దమ్మపేట: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన పామిరెడ్డి నాగకిరణ్‌రెడ్డి, తన భార్య ప్రత్యూష (34), కుమార్తె రుత్వికతో కలిసి బైక్‌పై సత్తుపల్లి ఆస్పత్రికి వెళ్తున్నారు. ముష్టిబండ గ్రామ శివారులోని రాజస్థాన్ దాబా హోటల్ సమీపంలోకి రాగా అతివేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న లారీ.. బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రత్యూష రోడ్డుపై పడగా ఆమె మీది నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త నాగకిరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



నందుకుమార్ మృతదేహం

చంద్రుగొండ: మండలంలోని బాలికుంట - మద్దుకూరు గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మద్దుకూరు గ్రామానికి చెందిన బోడా నందుకుమార్ (18) ద్విచక్రవాహనంపై మద్దుకూరు వైపు వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. వాహనం అదుపుతప్పడంతో రోడ్డుపై పడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు లేరని గ్రామస్తులు తెలిపారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మాచినేని రవి తెలిపారు.

రిటైర్డ్ పోలీసు అధికారి ఇంట్లో చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీరాంనగర్‌లోని రోడ్డునెంబర్–14లో నివాసముంటున్న రిటైర్డ్ ఏఆర్ ఏఎస్సై అంకిరెడ్డి మాధవరావు ఇంట్లో చోరీ జరిగింది. ఆయన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో హైదరాబాద్ వెళ్లి తిరిగి మంగళవారం వచ్చాడు. అప్పటికే ఇంటి తలుపు తీసి ఉండడంతో లోపల పరిశీలించగా దేవుడి పటాల వద్ద పెట్టిన బంగారం రూపులు, రూ.10 వేల నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముదిగొండలో..

ముదిగొండ: ముదిగొండకి చెందిన గొల్లపల్లి రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఇంట్లో మంగళవారం ఎవరూ లేని సమయాన గుర్తుతెలియని వ్యక్తులు తలుపు గడియను పగులగొట్టి ప్రవేశించారు. ఆతర్వాత బీరువాలోని రూ.40వేలు నగదు, రెండు జతల బంగారు చెవిదిద్దులు, రెండు జతల వెండి పట్టీలు చోరీ చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

గతమంతా ఘనచరిత్ర !



- ఒకప్పుడు అతిపెద్ద నియోజకవర్గంగా భద్రాచలం
- రాష్ట్ర విభజనతో పరిధి తగ్గిన వైనం
- పెను మార్పులకు లోనైన రామయ్య కొలువు

భద్రాచలం: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో పెద్ద నియోజకవర్గంగా విరాజిల్లిన భద్రాచలం నియోజకవర్గం ఇప్పుడు అందుకు భిన్నంగా మారింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విభజనలో పలు మండలాలు ఏపీకి కేటాయించటంతో కుదేలైన భద్రాచలం విస్తీర్ణంలో తెలంగాణలోనే అతి చిన్న నియోజకవర్గంగా మారింది. నియోజకవర్గాల క్రమం ఆధారంగా పరిశీలిస్తే 119వ నియోజకవర్గంగా భద్రాచలం చివరి స్థానంలో ఉంది.

ఎనిమిది నుంచి ఐదు మండలాలకు

రాష్ట్ర విభజనకు ముందు భద్రాచలం నియోజవర్గంలో భద్రాచలం, కూనవరం, చింతూరు, వీఆర్.పురం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలు ఉండేవి. రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మిగిలాయి. ఇందులో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.. వెంకటాపురం, వాజేడు మండలాలు ములుగు జిల్లాలో కొనసాగుతున్నాయి. 2009 ఎన్నికల్లో ఎనిమిది మండలాల్లో కలిపి 1,87,694 మంది ఓటర్లు ఉండగా, 2014 ఎన్నికల నాటికి 2,16,772 మంది ఓటర్లు నమోదయ్యారు. కాగా, 2018 ఎన్నికలలో ఐదు మండలాల్లో కలిపి 1,37,354 మంది ఓటర్లకు గాను 1,10,445 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,45,964 ఓటర్లు ఉన్నట్లు తుది జాబితా ద్వారా వెల్లడైంది.

ఐదు మండలాల్లో 176 పోలింగ్ స్టేషన్లు

భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కలిపి 176 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. భద్రాచలం మండలంలో 20 వార్డులకు 41 పోలింగ్ కేంద్రాలు, దుమ్ముగూడెం మండలంలో 37 గ్రామపంచాయతీల్లోని 104 గ్రామాలకు 40 కేంద్రాలు, చర్ల మండలంలో 26 గ్రామపంచాయితీల పరిధిలోని 60 గ్రామాలకు 36 కేంద్రాలు, వెంకటాపురం మండలంలోని 18 గ్రామపంచాయితీల పరిధిలోని 57 గ్రామాలకు 32 కేంద్రాలు, వాజేడు మండలంలో 17 గ్రామపంచాయితీల లోని 54 గ్రామాలకు 27 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 2018 ఎన్నికల కంటే ఈ సంఖ్య 16 పెరిగింది.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
భద్రాచలం	18,673	20,022	2	38,697	41
దుమ్ముగూడెం	16,168	17,774	0	33,942	40
చర్ల	14,796	15,854	1	30,650	36
వెంకటాపురం	11,430	12,761	1	24,192	32
వాజేడు	8,984	9,498	0	18,482	27
మొత్తం	70,051	75909	4	1,45,964	174

ఎన్నికల నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా నియమావళి పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు సూచించారు. స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు విధులు కేటాయించిన అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఓటర్లకు పూర్తిగా సహకరించి, వంద శాతం పోలింగ్ నమోదుకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల విధులను పూర్తి అప్రమత్తతో నిర్వర్తించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవో, ఏపీవోలు, నోడల్ అధికారి రామం, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పినపాక కాంగ్రెస్ అభ్యర్థిపై పునరాలోచించాలి

ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ నాయకుడు విజయగాంధీ



మాట్లాడుతున్న విజయ్‌గాంధీ

అశ్వాపురం: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు పినపాక నియోజకర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అధిష్టానం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరాలోచించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, పార్టీ పినపాక నియోజకవర్గ నాయకుడు బట్టా విజయగాంధీ కోరారు. మండలంలోని మొండికుంట గ్రామంలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో విజయ్‌గాంధీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని పట్టించుకోకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అభ్యర్థిగా ఎంపిక చేయడం సరికాదన్నారు. విజయగాంధీ మాట్లాడుతూ.. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ ఏ పిలుపునిచ్చినా పినపాక నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పార్టీ కార్యక్రమాలు చేపడుతూ అండగా ఉన్నానని, ఇప్పటికైనా అధిష్టానం పునరాలోచించాలని కోరారు. ఈ సందర్భంగా విజయగాంధీ కన్నీరు పెట్టుకోగా ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. కొందరు అతడిని పక్కకు లాక్కెళ్లారు. అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

క్లుప్తంగా...

మోసపూరిత హామీలపై అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక గూటి పక్షులే: డా.కె.లక్ష్మణ్
- కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని బీజేపీ ఖండిస్తోంది



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలపై రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ ఎంపీ, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సూచించారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఒక్కసారి మోదీ పాలన చూడాలని... వారసత్వ రాజకీయాలు లేకుండా, అవినీతికి, దళారీలకు అవకాశమే లేకుండా కేంద్రంలో మోదీ అందించిన పాలన రాష్ట్రంలో చూడాలని ప్రజలకు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన లక్ష్మణ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకేగూటి పక్షులని... ఈ రెండు పార్టీల పాలన తెలంగాణ ప్రజలు చూశారన్నారు. బీజేపీ పాలన చూసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నేతను ముఖ్యమంత్రి చేస్తానన్న బీజేపీ గురించి ఆలోచించాలన్నారు. కాగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంపీ సమాధానమిస్తూ, వివేక్ వెంకటస్వామి పార్టీలోనే ఉంటారని.. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఆయన చక్కటి మేనిఫెస్టో ఇచ్చారని తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, పవన్ కళ్యాణ్ విదేశీ పర్యటనలో ఉన్నారని.. ఆయన వచ్చాక కార్యాచరణ ప్రకటిస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

నా ఫేస్‌బుక్ పేజీ హ్యాక్.. ఇన్‌స్టాగ్రామ్ డిలీట్: రుద్రమ

సాక్షి, హైదరాబాద్: తన పేరుతో (రాణీరుద్రమరెడ్డి) ఉన్న ఫేస్‌బుక్ పేజీ హ్యాకింగ్‌కు గురైందని, అదే పేరుతో ఉన్న తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేశారని బీజేపీ అధికార ప్రతినిధి, సిరిసిల్ల అభ్యర్థి రాణీరుద్రమ తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐటీ హబ్ కేంద్రంగా విపక్షాల నాయకులు, కార్యకర్తలపై ఈ విధంగా దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను సిరిసిల్లలో కేటీఆర్ దుర్మార్గాలను సామాజిక మాధ్యమాల ద్వారా బయటి ప్రపంచానికి వెల్లడించకుండా చేయడానికే తన ఖాతాలను హ్యాక్ చేశారన్నారు.

నేడు బీజేపీ మలి జాబితా!

భేటీ కానున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ

- తెలంగాణ జాబితాపై పూర్తయిన కసరత్తు
- జేపీ నడ్డాతో జాబితాపై చర్చించిన కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఉత్కంఠకు తెరలేపిన బీజేపీ మలి జాబితాపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరుగనున్న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో మిగిలిన 66 మంది తెలంగాణ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కీలక నాయకులు సిద్ధం చేసిన జాబితాకు పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోద ముద్ర వేయనుంది. ఇప్పటికే జనసేనతో పొత్తులు సహా తుది జాబితాపై బీజేపీ పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. కాగా మంగళవారం తుది జాబితాపై కిషన్‌రెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిగిలిన స్థానాల్లో అభ్యర్థులపై సమీక్షతో పాటు జనసేనతో పొత్తుకు సంబంధించిన అంశాలపై నడ్డాతో కిషన్‌రెడ్డి చర్చించారని సమాచారం.

66 స్థానాలపై వడపోత

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఇప్పటికే ఒకసారి భేటీ అయిన సీఈసీ రెండు జాబితాల్లో కలిపి 53 మంది అభ్యర్థిత్వాన్ని ఆమోదం వేసింది. తొలి జాబితాలో 52 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన తర్వాత కొన్నిచోట్ల అసంతృప్తి బయటపడింది. రెండో జాబితాలో మహబూబ్‌నగర్ నుంచి ఏపీ మిథున్‌రెడ్డి పేరును బీజేపీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే మిగతా 66 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కొన్నిచోట్ల భిన్నాభిప్రాయాల నేపథ్యంలో... గత వారం ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా రాష్ట్ర నాయకత్వం పలుమార్లు భేటీ అయి అభ్యర్థుల వడపోతను పూర్తి చేసింది. అక్కడ వచ్చిన తుది నిర్ణయాల మేరకు పోటీదారుల జాబితాను సీఈసీకి నివేదించనుంది.

నేటి సీఈసీ సమావేశానికి మోదీ, అమిత్ షా

బుధవారం జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే సీఈసీ సమావేశానికి పార్టీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా సహా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, ఇతర సభ్యులు హాజరుకానున్నారు. వీరితో పాటు తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్ కుమార్, తరుణ్ ఛుగ్, సునీల్ భన్సల్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎన్నికల ఇంఛార్జ్ ప్రకాశ్ జవదేకర్‌లు కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం జరుగనున్న ఈ భేటీ అనంతరం తెలంగాణ మలి జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం ఏ క్షణమైనా విడుదల చేయనుంది.

ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నాం

- పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ర్యాలీ



పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ జాత్యహంకార దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలస్తీనాకు ఎలాంటి ఉనికి లేకుండా చేయడం అత్యంత బాధాకరమని, ప్రపంచ దేశాలు ఈ సంఘటనపై స్పందించాలని వారు కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంల్ ప్రజాపంథా, న్యూడెమాక్రసీ, లిబరేషన్ తదితర వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ జరిగింది. కార్యక్రమంలో సీపీఐఎంల్ ప్రజాపంథా కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమాక్రసీ నాయకులు వేములపల్లి వెంకటరాములు, సీపీఎం నాయకుడు ఎండీ అబ్బాస్, సీపీఐ జాతీయ నాయకుడు అజీజ్‌పాషా తదితరులు పాల్గొని ప్రసంగించారు. రంగారావు మాట్లాడుతూ అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ దురాక్రమణకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో వేలమంది విగతజీవులుగా మారుతున్నారని వెంకటరాములు ఆవేదన చెందారు. అబ్బాస్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాయడానికే ఇజ్రాయెల్ దాడులు చేస్తోందన్నారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి అంబేడ్కర్ కళాశాల వరకు పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కె.గోవర్ధన్, మురహరి, జానకిరాములు, గాదగోని రవి, బాలమల్లేశం, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘రజాకార్’తో శాంతిభద్రతలకు భంగం

- చరిత్రను వక్రీకరించి మతతత్వ కోణంలో సినిమాను తీశారు
- ఎన్నికల సంఘం కమిటీ ముందు రావి నారాయణరెడ్డి మనవరాలు వాదనలు

సాక్షి, హైదరాబాద్: చరిత్రను వక్రీకరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తీసిన రజాకార్ సినిమాను అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదల చేసేందుకు అనుమతించరాదని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి మనవరాలు రావి ప్రతిభారెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మత విద్వేషాలు సృష్టించరాదని ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని 5వ నిబంధన చెబుతోందని గుర్తుచేశారు. అందువల్ల భువనగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుడూరు నారాయణరెడ్డి నిర్మించిన ఈ సినిమాపై ఎన్నికల కోడ్ కింద చర్యలు తీసుకొనే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందన్నారు. ఆమె ఫిర్యాదుపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారి లోకేశ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణకు హాజరైన ప్రతిభారెడ్డి ఈ మేరకు తన వాదనలు వినిపించారు. సినిమాలో వాడిన బతుకమ్మ పాట తెలంగాణ మహిళల మనోభావాలను కించపరిచేలా ఉందన్నారు. కాగా, సినిమా విషయంలో త్వరలో ఎన్నికల సంఘం నిర్ణయాన్ని తెలియజేస్తామని కమిటీ హామీ ఇచ్చిందని ప్రతిభారెడ్డి మీడియాకు తెలిపారు.

పోలీసు అధికారుల బదిలీలు సమీక్షించండి

బీజేపీ నేత శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. హైదరాబాద్ నగర పరిధిలో పోలీసు అధికారుల బదిలీలు జరిగిన తీరును సమీక్షించాలని నగర పోలీస్ కమిషనర్‌కు బీజేపీ ఈసీ వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికార బీఆర్ఎస్ పార్టీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం నాయకులు కోరుకున్నట్టు బదిలీలు జరిగాయని సీపీకి పంపించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ప్రతిని తెలంగాణ (సీఈవో), ఢిల్లీలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మర్రి శశిధర్‌రెడ్డి పంపించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- గురుకుల కళాశాల ప్రిన్సిపాలే కారణమన్న బంధువులు
- ఐదు గంటలపాటు ఆందోళన.. ఉద్రిక్తత



వసుధ (ఫైల్)



ఎక్లార కళాశాలలో ఆందోళన చేస్తున్న వసుధ బంధువులు

మద్నూర్ (జుక్కల్): గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం బంధువుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తంగా మారింది. విద్యార్థిని మృతికి ప్రిన్సిపాల్ కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో బిచ్కుంద మండలం మానేపూర్‌కు చెందిన దాసరి వసుధ (17) ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఆమె హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళాశాలకు తిరిగి వెళ్లిన తెల్లారే వసుధ ఆత్మహత్యకు పాల్పడటంతో వసుధ తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

కాలేజీకి వచ్చిన మరునాడే

దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన వసుధను సోమవారం ఆమె తల్లి అంజవ్వ, మేనమామ మోహన్ కళాశాలలో దింపేసి వెళ్లిపోయారు. ఆ రాత్రి వసుధ భోజనం చేయలేదని, మంగళవారం ఆరోగ్యం బాగాలేదని ప్రార్థనకు రాకుండా హాస్టల్ గదిలోనే ఉండి పోయిందని తోటి విద్యార్థినులు చెప్పారు. తర్వాత వసుధ తరగతి గదికి కూడా రాకపోవడంతో కళాశాల సిబ్బంది హాస్టల్ గదికి వెళ్లి చూశారు. వసుధ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు కనపడడంతో తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వసుధ మృతికి కళాశాల ప్రిన్సిపాల్ సవిత, సిబ్బందే కారణమంటూ బంధువులు పెద్ద సంఖ్యలో కళాశాలకు చేరుకున్నారు. హాస్టల్ గదుల తలుపులు, కిటికీ అద్దాలను పగలగొట్టి ఐదు గంటలపాటు ఆందోళన చేశారు. పరిస్థితిని గమనించిన పోలీసులు ప్రిన్సిపాల్, సిబ్బందిని ఒక గదిలో ఉంచి గడియ పెట్టి కాపలా ఉన్నారు. బంధువులు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆ గదిపై చల్లే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ క్రిష్ణలపై పడింది. పోలీసు సిబ్బంది నిలువరించడంతో ప్రమాదం తప్పింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు.

మార్కుల కోసం కాలేజీ టార్చర్..

▶ మొదటి పేజీ తరువాయి

వెంటనే అతన్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌లో ‘మంచి మార్కులు తెచ్చుకోవాలని టీచర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఒత్తిడి, టార్చర్ చేస్తున్నారు. సారీ అమ్మా నాన్న, తమ్ముడు.. దయచేసి ఎవరూ నారాయణ కళాశాలలో చేరొద్దు. ఇదే నా జీవితంలో చివరి రోజు. దయచేసి విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దు. నా తమ్ముడిని మంచి కళాశాలలో చేర్పించండి. అతని భవిష్యత్తు బావుండాలని కోరుకుంటున్నా. చివరగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు క్షమాపణలు’ అని లేఖలో రాశాడు. దీంతో నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి బంధువులు, స్థానికులు, ఏబీవీపీ నాయకులు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

సిద్దిపేట సీపీ, ఏసీపీలను బదిలీ చేయాలి

- సీఈవోకు బీజేపీ నేత, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: అధికార బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతూ బీజేపీపట్ల పక్షపాత వైఖరిని అవలంబిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్, ఏసీపీలపై కఠినచర్యలను తీసుకొని వారిని అక్కడి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా కేంద్ర బలగాలను దింపాలని కోరారు. మంగళవారం ఈ మేరకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. గతంలోనే సిద్దిపేట పోలీసుల పక్షపాత తీరుపై సీఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. బీజేపీ కార్యకర్తలపై దాడులకు సంబంధించి సీపీ దృష్టికి తెచ్చినా ఏ చర్యా తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఆ పార్టీ నాయకులు అవకాశంగా తీసుకుని బీజేపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ దాడితో బీజేపీకి ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. తనకు సెక్యూరిటీ పెంచాలని గతంలోనే డీజీపీని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు.

జిల్లా వార్తలు

దేశాన్ని ఒక్కటి చేసిన ‘పటేల్’

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న పీఓ ప్రతీక్, అధికారులు

భద్రాచలం: దేశానికి స్వాతంత్య్రం వచ్చాక సంస్థానాలను దేశంలో కలిపేందుకు కృషి చేసిన గొప్ప నేత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర ఉద్యమం తర్వాత ప్రథమ హోం మంత్రిగా దేశానికి అమూల్యమైన సేవలు అందించారని తెలిపారు. అనంతరం అధికారులతో పీఓ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు తానాజీ, భీమ్, ఉదయ్‌భాస్కర్, ఆదినారాయణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ కేసులు పెరుగుతున్నాయి..

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసాయం అందిస్తున్న కేసుల సంఖ్య ఇటీవల పెరిగిందని న్యాయసేవాధికార సంస్థ ఖమ్మం జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా తెలిపారు. సంస్థపై కక్షిదారులకు నమ్మకం పెరుగుతుందడానికి ఇది నిదర్శనమని వెల్లడించారు. ఖమ్మంలో మంగళవారం న్యాయమూర్తి సంస్థ ప్యానల్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు ఇటీవల కేసుల సత్వర పరిష్కారానికి ఇచ్చిన ఆదేశాలను వారికి వివరించారు. ఆతర్వాత న్యాయసహాయ కేసుల పురోగతిని సమీక్షించారు.

క్రైస్తవ పరిరక్షణ దళం అధ్యక్షుడిగా ఇసాక్



కొణిజర్ల: క్రైస్తవ హక్కుల పరిరక్షణ దళం (సీఆర్‌పీఎఫ్) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షుడిగా గోరపూడి ఇసాక్ నియమితులయ్యారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామానికి చెందిన ఇసాక్‌ను మంగళవారం జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా సమావేశంలో ఎన్నుకున్నారు. సమావేశంలో సీఆర్‌పీఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ పాల్ ప్రసాద్‌తోపాటు భావన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పంట.. ఎంతో మెరుగంటా..

- మిద్దె, పెరటి తోటల పెంపకందారులకు ప్రోత్సాహం
- అవసరమైన వారికి విత్తనాలు, మొక్కల సరఫరా
- ఇంటి పంటల సాగులో ఆదర్శంగా పలువురు..



ఖమ్మం మామిళ్లగూడెంలో మిద్దెపై సాగుచేసిన కూరగాయలు, పండ్ల మొక్కలు

ఖమ్మంవ్యవసాయం: అందరిలోనూ ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. కొత్తగా వస్తున్న వైరస్‌లు, వ్యాధుల భయంతో మార్కెట్‌లో ఏది కొనాలన్నా, తినాలన్నా భయపడుతున్నారు. గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు వంటివి పెరళ్లలో పండించడం సహజం. కొందరు ఆ పంటలనే పట్టణాల్లో విక్రయిస్తుంటారు. మరికొందరు అధిక దిగుబడి, తెగుళ్ల నివారణకు విరివిగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడుతుండటంతో వీటిని వినియోగించిన వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో ఇంట్లోనే పంట పండిస్తే బాగుంటుందని పలువురు మిద్దె తోటలు, పెరటి తోటల పెంపకానికి సిద్ధమవుతున్నారు.

పల్లె, పట్నం తేడా లేకుండా..

ప్రస్తుత తరుణంలో గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా మిద్దె తోటలు, పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు డాబాలపై, ఆవరణల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కరోనా నుంచి పంటల సాగు పెరుగుతోంది. ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారు, గృహిణులు, వ్యాపారులు ఈ అంశంపై ఎక్కువగా దృష్టిసారించడమేకాక సాంకేతికను జోడిస్తున్నారు. జిల్లాల వారీగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పంటల సాగుపై పరస్పరం సలహాలు, సూచనలు ఇచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఖమ్మంలో మిద్దె, పెరటి తోటల పెంకందారురాలు కుతుంబాక మాధవి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అడ్మిన్లతో రెండు రోజుల కిందట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సాగు విస్తృతికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈమేరకు సమావేశానికి హాజరైన పలువురు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ప్రోత్సహించటమే లక్ష్యం



మిద్దె తోటల సంక్షేమ సంఘాన్ని రిజిస్టర్ చేయించాం. తొలకరి సమయంలో నాణ్యమైన విత్తనాలు ఇవ్వడమే కాక వంగ, టమాట, మిరప మొక్కలను నర్సరీల్లో తక్కువ ధరకు ఇప్పిస్తాం. మా ఇంట్లో మొక్కలు పెంచడంతో పాటు ఇతరులకు సలహాలు ఇస్తున్నాం. -కొల్లి కృష్ణకుమారి, గుంటూరు

విదేశాల నుంచి విత్తనాలు



2018లో సింగపూర్, మలేషియా నుంచి టమాట విత్తనాలను తెప్పించి ఇక్కడ సాగు చేశాం. వీటిని ఆసక్తి ఉన్న వారికి ఇస్తున్నాం. టమాట, ఇతర కూరగాయల విత్తనాలను పోస్టు ద్వారా పంపిస్తున్నాం. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల మందికి విత్తనాలను ఇచ్చాం. - తమింసా అప్పారావు, అమీర్‌పేట, హైదరాబాద్



పెరట్లో పండిన ఆరున్నరడుగుల సొరకాయతో సత్తిరాజు

ఇల్లే ఓ రైతుబజార్



మా ఇళ్ల పైనే కాకుండా 250 గజాలఖాళీ స్థలంలోనూ మొక్కలు నాలుగున్నరేళ్లుగా పెంచుతున్నాం. ఆపిల్ బేర్, స్టార్ ఫ్రూట్స్, థాయ్ మామిడి, డ్రాగన్ ఫ్రూట్ వంటి సాగవుతున్నాయి. ఇంకా పలు కూరగాయలూ సాగు చేస్తున్నాం. సోరకాయ ఆరున్నర అడుగుల పొడవు పెరిగింది. -ఎం.సత్తిరాజు, వేల్పూరు, పశ్చిమగోదావరి

పాఠశాలల్లో అవగాహన



ఉద్యాన శాఖ సహకారంతో రెండేళ్లుగా మిద్దెలపై కిచెన్ గార్డెన్స్ నిర్వహిస్తున్నాం. ఆకుకూరలే కాక తీగజాతి కూరగాయలను కూడా పండిస్తున్నాం. ఈ అంశంపై విద్యార్థి దశ నుంచే అవగాహన, ఆసక్తి కల్పించేందుకు గాను పాఠశాలలకు వెళ్లి వివరిస్తున్నాం. -విజయలక్ష్మి - సుకన్య, ప్రకాశం జిల్లా

తెలుగు రాష్ట్రాల్లో విస్తరణే లక్ష్యం



తెలుగు రాష్ట్రాల్లో ఇంటి పంటలను విస్తృతంగా ప్రోత్సహించటమే ప్రధాన లక్ష్యం. వాట్సప్ గ్రూప్‌ల ద్వారా సలహాలు ఇచ్చి పుచ్చుకుంటూ మిగతా వారికి అవగాహన కల్పిస్తున్నాం. పదిహేనేళ్లుగా ఖమ్మంలో మిద్దె పంట, పెరటి తోటలు సాగు చేస్తున్నాం. -కుతుంబాక మాధవి, ఖమ్మం

విశాఖ భక్తుల సుందరకాండ పారాయణం



సుందరకాండ పారాయణం చేస్తున్న మహిళలు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం విశాఖపట్నంకు చెందిన భక్తులు సుందరకాండ పారాయణం చేశారు. విష్ణు గానామృతం వర్షిణి భజన బృందానికి చెందిన సుమారు 50 మంది మహిళలు ఏకరూప దుస్తులతో తొలుత ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత సుందరకాండ పారాయణంతో భక్తులను ఆకట్టుకున్నారు.

కేసీఆర్ సభకు తరలిరండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన ఎమ్మెల్సీ మధు, నాయకులు

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/కల్లూరురూరల్: కల్లూరులో బుధవారం జరగనున్న ప్రజాఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానుండగా, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని బీఆర్ఎస్ విజయం ఖాయమన్న విషయాన్ని చాటాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. కల్లూరులో సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను లక్ష కుటుంబాలకు ప్రత్యక్షంగా వివరించామని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ఆచరణ సాధ్యం కాదని.. సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించేటప్పుడు నిపుణులతో చర్చించారని వెల్లడించారు. కాగా, సభకు సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 75 వేల మంది అభిమానులు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు వేదిక, బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు తదితర ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఈ నెల 9న నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగో సారి వెంకటవీరయ్య విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, కట్టా అజయ్‌కుమార్, పాలెపు రామారావు, లక్కినేని రఘు, బీరవల్లి రఘు, దొడ్డా శ్రీనివాసరావు, కీసర వెంకటేశ్వరరెడ్డి, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, భద్రరాజు, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మాధురి మధు పాల్గొన్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి



సీఎం సభ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి సత్యవతి, ఎంపీలు కవిత, రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఇల్లెందులో పరిశీలించిన మంత్రి సత్యవతి, ఎంపీలు

ఇల్లెందు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లెందులో బుధవారం జరగనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానుండగా, ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. ఇల్లెందు మండలం మొట్లగూడెంలో సభ ఏర్పాట్లను మంగళవారం ఆమె ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సత్యవతి మాట్లాడారు.. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి ఫలాలు అందాయని తెలిపారు. ఇల్లెందులో సభకు 75 వేల మంది హాజరవుతారని మంత్రి వెల్లడించారు. భద్రాద్రి జిల్లాలో 51 వేల మందికి 1.58 లక్షల ఎకరాల పోడు భూమికి పట్టాలు ఇచ్చామని తెలిపారు. సీఎం మానస పుత్రిక సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు కూడా త్వరలో పూర్తిచేసి ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందిస్తామని వివరించారు. కాగా, కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించేలా బుధవారం జరిగే సభకు ప్రజలు తరలిరావాలని సత్యవతి కోరారు. తొలుత నాగుల్ మీరా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయగా, మంత్రి సత్యవతి పుట్టిన రోజు సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ జానీపాషా, తదితరులు పాల్గొన్నారు.